ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 8 జూన్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(శనివారం)
కనిష్ఠం : 29

బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం

6

వెంకన్న ఆలయానికి

పోటెత్తిన భక్తజనం

» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.57లక్షలు

6

సృజనకు చుక్కాని.. నైపుణ్యానికి సాన..

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

» యువత భవితకు భరోసా..
» రాష్ట్రంలో ఐదు.. అందులో మనకూ ఒకటి
» ఉభయ గోదావరి జిల్లాల యువత నైపుణ్యానికి పదును
» పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ధ్యేయం
» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో ఆర్‌టీఐహెచ్‌ని ప్రారంభించనున్న సీఎం

6



ఆర్‌టీఐహెచ్ భవనానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

మసీదుల్లో బక్రీద్

బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

8



ద్రాక్షారామలో ఈద్ ప్రసంగం చేస్తున్న మతగురువు, పాల్గొన్న ముస్లింలు



తాళ్లపూడి మండలం సూరయ్యపేటలో పునాదిలో నిలిచిన ఇంటి నిర్మాణాలు

ఇచ్చేది చాలక.. ఇల్లు కట్టలేక!

పేదల గూడు..కష్టాలు బోలెడు

» సాయం రూ.2.30 లక్షలు
» అయ్యేది రూ.5.75 లక్షలు
» ముందుకు రాని ప్రజానీకం
» నెరవేరని నిర్మాణ లక్ష్యం
» అధికారులపై తీవ్ర ఒత్తిడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..అన్నారు పెద్దలు.. ఆ రెండూ అంత కష్టమైన పనులన్న మాట... పెళ్లి మాటేమో కానీ.. ఇల్లు కట్టాలంటే మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో గగనంగా మారింది. ఒక వేళ కష్టపడిన కట్టినా పూర్తవకుండానే అమ్మేసుకుంటున్న వారెందరో.. ఇంటి నిర్మాణం అనేది సాధారణ, మధ్యతరగతి ప్రజలకు కలగానే మారింది. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇళ్ల కట్టుకోమన్నా కట్టుకోలేని స్థితిలో పేదలు ఉన్నారు.

రూ.1.80 లక్షలకు ఇల్లు కట్టగలమా?

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల ఆర్థిక సమస్యలను గుర్తించి బ్యాంకు రుణం ఇప్పించి టిడ్కో ఇళ్లు నిర్మించారు.

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను మూలన పడేసి పేదలకు సెంటుభూమి ఇచ్చి అందులోనే రూ.1.80 లక్షతో ఇల్లు నిర్మించుకోవాలనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది.సెంటు స్థలంలో రూ.1.80 లక్షలతో పునాది కూడా పడదు. అయినా చాలా మంది పేదలు అప్పో సప్పో చేసి ఇల్లు కట్టేసుకున్నారు.ప్రస్తుతం ఇళ్లను అమ్మే సుకుంటున్నారు.ఏ కాలనీకి వెళ్లినా ఇల్లు అమ్మబడును అనే బోర్డు లు దర్శనమిస్తున్నాయి.



సూరయ్యపేటలో అమ్మకానికి ఇల్లు

ఇల్లు కట్టాలంటే..అప్పు చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.30 లక్షల వరకూ ఇస్తున్నా.. లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఏదో కొద్దిగా ఆర్థిక స్తోమత ఉన్నవారు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.ఎందుకంటే గత జగనన్న కాలనీల్లో ఒక్కో లబ్ధిదారుకు ఇచ్చిన 51 గజాల్లో 20 టు 20 అడుగులు మేర ఇల్లు నిర్మించి రంగులతో సహా అందివ్వాలంటే రూ.5.75 లక్షలు అవుతుందని అంచనా ఉంది. బేస్‌మెంట్‌కు రూ.లక్షా 10 వేలు, కిటికీలు, గుమ్మాలు పెట్టి గోడలు కట్టడానికి మరో రూ.1 లక్షా 10 వేలు, శ్లాబ్‌కు రూ.1 లక్షా 20 వేలు,ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కుకు రూ.60 వేలు, ప్లాస్టింగ్‌కు రూ.ఒక లక్ష వరకూ అవుతుంది. ఇలా సాధారణంగా కట్టుకుంటే రూ.5.75 లక్షలు అవుతుంది. అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ.2.30 లక్షలు అంటే మరో రూ.3.45 లక్షలు అప్పు చేయక తప్పని పరిస్థితి.దీంతో ఇంటి నిర్మాణానికి పేదలు ముందుకు రావడంలేదు. కట్టే ఇంటిపై బ్యాంకు రుణం ఇప్పిస్తే నెమ్మదిగా తీర్చుకుంటామని ఓ లబ్ధిదారుడు చెప్పడం గమనార్హం.

రూ.2.30 లక్షలు చేసినా ఇబ్బందే..

2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం హయాంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదలకు భారీ ఎత్తున సహాయ పడాలనే ఆలోచనకు వచ్చింది. ఎస్సీ, బీసీ లబ్ధిదార్లకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75 వేల వంతున ఆర్థిక సహాయం చేసినా పేదోడు ఇంటి నిర్మాణానికి ఖర్చు సరిపోవడంలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేకపోతున్నారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 12వ తేదీకి సామూహిక గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయాలని ఆదేశించినా ఆర్థిక సమస్యలతో ముందుకు రావడంలేదు.లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులు ప్రయత్నించినా వెనకడుగు వేస్తున్నారు.ఉన్నతాధికారులు టార్గెట్లు విధించడంతో సచివాలయ,హౌసింగ్, రెవెన్యూ అధికారులు, ప్రత్యేకాధికారులపై ఒత్తిడి తప్పడం లేదు.



రాజమహేంద్రవరంలో శనివారం ఎండమావులు

నై..రుతు పవనాలు!

మే నెలలో హాయ్.. జూన్‌లో బాబోయ్!

» ఉక్కబోతతో జనం విలవిల
» సుర్రుమంటున్న సూరీడు
» ఏసీ రూమ్‌లకే జనం పరిమితం
» జూన్‌లో వింత వాతావరణం
» ఈ నెల 12న అల్పపీడనం

మొన్న మే నెలలో.. ఎక్కడ చూసినా హాయ్ హాయ్..పెద్దగా కానరాని సూరీడు..రోజంతా చల్లదనమే..మబ్బుల చాటున దాగిన సూరీడుతో మండుటెండలు మాయం.. అనేక చోట్ల వర్షాలు.. నిజంగానే ఇది మే నెలేనా అన్నట్టు కానరాని భారీ ఉష్ణోగ్రతలు..ఊసే లేని వడగాడ్పులు.. ఉక్కబోత...హమ్మయ్య ఈ వేసవి ఇక ముగిసిపోయింది.. అని జనం ఊపిరిపీల్చుకున్నారు... ఈలోపు రుతు పవనాల ఆగమనం... ఇక హాయి హాయి అనుకున్నారంతా.. కానీ!

జూన్‌లో చల్లదనమే అనుకున్నారంతా.. కానీ సూరీడు సుర్రుమంటున్నాడు.. ఉదయం నిద్రలేవగానే బయట ఉక్కబోత.. తీవ్రవేడి.. కానరాని వానలు.. ఎండలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. రుతు పవనాలు వచ్చేశాయనుకుంటే వాన జాడ లేక జనం విలవిల్లాడిపోతున్నారు..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వాతావరణం మారింది.. ఏటా మే నెలో ఎండలు మండిపోతాయి..ఇళ్ల నుంచి బయటకే రాలేం.. జూన్ వచ్చే సరికి వర్షాలు ప్రారంభమై వాతావరణం కొంత చల్లబడుతుంది.ఏళ్ల తరబడి కనిపించే వాతావరణ పరిస్థితులు ఇవే.. అటు వాతావరణ శాఖ కూడా ఏటా మే నెలలో ఎండలు మండిపోతాయని..జూన్‌లో నైరుతి రుతుపవనాలతో పరిస్థితి కాస్త చల్లబడుతుందని చెబుతుంటారు.అదేం విచిత్రమో కానీ.. ఈ సారి వాతావరణం ఉమ్మడి జిల్లాలో జనాలకు చుక్కలు చూపిస్తోంది. మే లో చల్లచల్లని ఆహ్లాదం పంచి..ఇప్పుడు జూన్‌లో వేడి దంచేస్తుంది. వాతావరణశాఖ నిపుణులు సైతం గందరగోళానికి గురైన ప్రస్తుత పరిస్థితులపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

చల్లదనమే!

ఈ ఏడాది రొటీన్‌కు భిన్నంగా కాస్త చల్లదన'మే' అనిపించాయి. ఉదయం ఎంత భానుడు విశ్వరూపం చూపినా.. సాయంత్రమయ్యేసరికి మాత్రం వరుణుడు కూల్ చేసేవాడు. ప్రతి రోజూ ఉమ్మడి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం నగరాల్లో మే నెలలో అనేక సార్లు భారీ వర్షాలతో వర్షపాతం ఏకంగా ఆరు సెంటీమీటర్ల వరకు నమోదైంది. ఈ మూడు జిల్లాల్లో ఏకంగా అనేక మండలాల్లో వరుసగా 8 రోజులు వర్షం కురిసింది. దీంతో మే నెలంతా చల్లచల్లగా గడిచింది.కాకినాడ జిల్లాలో ఏప్రిల్‌లో 16.4 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉంటే 45.78 మి.మీ. కురిసింది. మేలో 109 మి.మీ.కు 115 మి.మీ. నమోదైంది. జూన్‌కు వచ్చేసరికి 8.1 మి.మీ. తక్కువ నమోదైంది.కోనసీమ జిల్లాలో మే నెలంతా కలిసి 72.55 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 130 మి.మీ. కురిసింది. జూన్‌లో ఈ ఏడు రోజుల్లో ఒక్కరోజు వర్షం నమోదవలేదు.0.65 మి.మీ. లోటు కనిపిస్తోంది. తూర్పు గోదావరి జిల్లాలో మే నెలంతా కలిపి 78.56 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 135.54 మి.మీ. కురిసింది. తీరా జూన్‌కు వచ్చేసరికి ఏడు రోజుల్లో 0.76 మి.మీ. లోటు కొనసాగుతోంది.

బాబోయ్ జూన్..

జూన్ నెల ఆరంభం కాగానే అంతా వర్షాలే అనుకున్నారు.తీరా చూస్తే ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మూడు రోజులుగా సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.ఆ ప్రచండభానుడి భగభగలతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.ఉదయం ఆరు గంటల నుంచే వాతావరణం ఉక్కబోతగా ఉంటోంది. పది గంటలకే 'ఉక్క'రూపం దాల్చుతోంది. మధ్యాహ్నం పూర్తిగా నడినెత్తిన చేరుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నెల పదో తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నెల 12న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా. ప్రస్తుత వాతావరణానికి కారణం మందగించిన రుతుపవనాల కదలికే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇవి మందకొడిగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విశ్లేషిస్తున్నారు.



పి.గన్నవరంలో ఏటిగట్టు చెంతనే ఉన్న చెత్త నిల్వలు

సంకల్పం నెరవేరేనా?

» స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సంకల్పం దిశగా ప్రభుత్వం చర్యలు
» ప్రధాన రహదారులు, ఏటిగట్ల చెంతనే చెత్త నిల్వలు
» నిర్మాణాలు పూర్తికాని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు
» కొన్నిచోట్ల నిర్మాణాలు జరిగినా... ఇంకా నిరుపయోగంగానే
» జిల్లాలో 385 గ్రామ పంచాయతీలకు 267 గ్రామాల్లో షెడ్లు
» పలు గ్రామ పంచాయతీల్లో కోర్టు వివాదాలు, స్థలాల కొరత
» ఏకీకరణ సామాజిక వ్యర్థాల నిర్వహణకు ప్రణాళికలు

ఆంధ్రజ్యోతి-పి.గన్నవరం:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రామాలలో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి చెత్తను సేకరిస్తున్నారు. ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెత్తను సేకరించే కార్యక్రమం, అవగహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో ఎక్కడిచెత్త అక్కడే ఉంటోంది. దీంతో ఆ కార్యక్రమం లక్ష్యం నీరుగారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీడీపీ హయాంలో గతంలో కొన్ని గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. మరికొన్ని గ్రామాల్లో స్థల వివాదాలతో ఇబ్బందులు వచ్చి షెడ్లనిర్మాణం జరగలేదు. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. అప్పట్లో చెత్తసేకరణ విషయంలో అధికారులు పర్యవేక్షణ కొరవడడంతోపాటు క్లాప్‌మిత్రలకు జీతాలు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఆయా కేంద్రాలు మరుగున పడిపోయాయి. అప్పటినుంచి ప్రధానరహదారులు, గ్రామశివారు ప్రాంతాలు, ఏటిగట్లు, గోదావరినది పరివాహక ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో చెత్తను నిల్వచేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో సచివాలయాలు చెంతనే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. కాగా జిల్లాలో చాలాచోట్ల డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్తతో సంపదతయారీ కేంద్రాలు నిర్మాణం జరగలేదు. దీంతో ప్రధాన రహదారులు, ఏటిగట్లు, గోదావరి నదీ తీరాల్లో చెత్తను డంప్ చేస్తున్నారు. ఇలా చెత్తను డంప్ చేయడం ద్వారా అంటువ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో ఇప్పటివరకు ఎక్కువశాతం గ్రామ పంచాయతీల్లో గ్రామాల్లో షెడ్లు పూర్తయినా పలుచోట్ల చెత్తను పూర్తిస్థాయిలో సేకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తడి, పొడి చెత్తసేకరణ విషయంలో వెనకడుగుతో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా తయారయ్యాయని పలువురు విమర్శలు చేస్తున్నారు.

ఐఎస్‌డబ్ల్యూఎంకు ప్రణాళికలు...

గ్రామాల్లో చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం తదితర అంశాలు పూర్తిస్థాయిలో నిర్వహణ జరగడంలేదు.ఆయా గ్రామాలకు క్లాప్ మిత్రాలు అందుబాటులో లేకపోవడం ఒక కారణమైతే ఆయా పంచాయతీలకు ఆదాయ వనరులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మండల కేంద్రంతోపాటు కొన్ని ప్రధాన గ్రామాల్లో మాత్రమే చెత్త సేకరణ జరుగుతోంది. కానీ ఆ చెత్త కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర నెరవేరడంలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పులు చేశారు. త్వరలో క్లస్టర్ల విధానం, పంచాయతీలకు గ్రేడ్‌లు విధానాలు తెరమీదకు రానున్నాయి. ఈ క్రమంలోనే ఏకీకరణ సామాజిక వ్యర్థాల నిర్వహణ(ఐఎస్ డబ్ల్యూఎం) విధానం తీసుకురానున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా పట్టణ స్థానికసంస్థలకు 30 కిలోమీటర్లలోపులో ఉన్న గ్రామ పంచాయతీల వివరాలను జిల్లాస్థాయిలో అధికారులు మండల స్థాయిలో ఉన్న డిప్యూటీ ఎంపీడీవోల నుంచి సేకరిస్తున్నట్లు తెలిసింది. ఒక కుటుంబం నుంచి వారసత్వ వ్యర్థాలు, తడి, పొడి చెత్త ఎంతమేర ఉత్పత్తి అవుతోంది, ఉత్పత్తి విలువ, దూరం, సంబంధిత వ్యర్థాలను ఏ వాహనం ద్వారా తరలించడానికి వెసులుబాటు, చార్జీలు అవుతాయి తదితర వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో అమలాపురంతోపాటు రామచంద్రపురం పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి సమీప గ్రామాల వివరాలను సేకరిస్తున్నారు. అనంతరం ఏకీకరణ సామాజిక వ్యర్థాల నిర్వహణ(ఐఎస్‌డబ్ల్యూఎం) ప్రాజెక్టును ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించి పూర్తిస్థాయిలో విజయవంతం చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు ఎంతవరకు కార్యరూపం దాల్చనుందో వేచి చూడాలి.

ఇలా చేస్తే అభివృద్ధి

ఏకీకరణ సామాజిక వ్యర్థాల నిర్వహణ (ఐఎస్‌డబ్ల్యూఎం) ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయా అంటే పలువురు చెందుతాయనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీల నిర్వహణ బాధ్యతే కష్టంగా ఉన్న తరుణంలో చెత్త బాధ తప్పుతుందని చెప్తున్నారు. సంబంధిత సంస్థే చెత్తను సేకరించి తీసుకుపోతుందని దానికి అయ్యే ఖర్చులు వాటి ద్వారా వచ్చే ఆదాయంతోపాటు ఆర్థికసంఘం నిధులనుంచి ప్రభుత్వమే చెల్లించే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇలా అధిక మొత్తంలో సేకరించిన తడి చెత్తతో ఎరువు ఉత్పత్తి పెరుగుతుందని చెప్తున్నారు. వారసత్వ వ్యర్థాలు, పొడిచెత్త మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు స్థల సేకరణ తిప్పలు తప్పుతాయని చెప్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. కోనసీమజిల్లాకు సంబంధించి ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 3315మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 34శాతంతో 1137మందిఉత్తీర్ణులైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సోమశేఖరరావు తెలిపారు. ఒకేషనల్ విభాగంగా 947మంది విద్యార్థులకు 40శాతంతో 380మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 2508మందికి 45శాతంతో 1122మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 826మంది విద్యార్థులకు 55 శాతం 454మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

నేటి నుంచి బహిరంగ ఇసుక రీచ్‌ల్లో విక్రయాల నిలుపుదల

అమలాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు సమీపిస్తున్నందున ఈనెల 8 నుంచి బహిరంగ ఇసుక రీచ్‌ల్లో ప్రత్యక్ష విక్రయాలు నిలుపుదల చేసి స్టాక్ యార్డుల ద్వారా విక్రయానికి చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 20 ఇసుక రీచ్‌ల్లో విక్రయాలను నిలుపుదల చేస్తామన్నారు. భవన నిర్మాణ వినియోగదారులు విషయాన్ని గమనించి ఇకపై స్టాక్ యార్డుల ద్వారా ఇసుక కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలోని రావులపాలెం, గోపాలపురం, జొన్నాడ, తాతపూడి, అమలాపురం, ఊబలంక-1, 2, వద్దిపర్రు-1, 2, పొడగట్లపల్లి-1, 2, కపిలేశ్వరపురం, ఆలమూరు, పులిదిండి, ఆత్రేయపురం, అంకంపాలెం, నార్కేడుమిల్లి రీచ్‌లలో ఈనెల 8 నుంచి ప్రత్యక్ష ఇసుక విక్రయాలు నిలుపుదల చేసేందుకు స్థానిక అధికార యంత్రాంగంతో ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. జిల్లా భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలో స్టాకు యార్డుల ద్వారా విక్రయాలు కొనసాగిస్తామన్నారు. బహిరంగ రీచ్‌లకు వెళ్లే మార్గాలను మూసివేసే విధంగా చర్యలు చేపట్టి నిషేధాజ్ఞలు విధించామన్నారు.



వద్దిపర్రు ఇసుక రీచ్ వద్ద అధికారులు

నేడు డివిజన్ కేంద్రాల్లో యోగాంధ్ర

» కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో ఆదివారం యోగాంధ్ర-2025 కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా యోగా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు మూడు రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు. కొత్తపేట డివిజన్‌కు సంబంధించి కొత్తపేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని అమలాపురం డివిజన్‌కు సంబంధించి పట్టణంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు ఆరోగ్య ఉద్యాన వనంలోను, రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ కళాశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమలాపురం మెట్ల సత్యనారాయణ ఆరోగ్య ఉద్యానవనంలో యోగాంధ్ర ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు శనివారం పరిశీలించారు. జిల్లాయంత్రాంగంఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల భాగస్వామ్యంతో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో కోరారు. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతతకు యోగసనాలు, ధ్యానం వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. వయోవృద్ధుల్లో ఆరోగ్యచైతన్యం పెంపొందించడంతోపాటు యోగాపట్ల ఆసక్తిని కల్పించే లక్ష్యంతో యోగాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు.



ఆర్‌టీఐహెచ్ భవనానికి తుది మెరుగులు

సృజనకు చుక్కాని.. నైపుణ్యానికి సాన

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

- యువత భవితకు భరోసా..
- రాష్ట్రంలో ఐదు.. అందులో మనకూ ఒకటి
- ఉభయగోదావరి జిల్లాల యువత నైపుణ్యానికి పదును
- పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ధ్యేయం
- ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని వర్చువల్‌గా ప్రారంభించను న్న సీఎం చంద్రబాబు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సానపట్టే కొద్దీ పదునెక్కే యంత్రాలు యువత బుర్రలు.. ఆ మదిలో ఎన్నో ఐడియాలు.. అడుగు వేద్దామంటే ఆర్థిక ఇబ్బందులు. కొత్తగా ఏదైనా చేద్దామనే తపన.. చేతిలో చిల్లిగవ్వ లేని నిస్సహాయత.. తెలివి తేటలకు కొదువ ఉండదు.. కానీ తెల్లారితే రెక్కాడాల్సిందే.. కాస్త ప్రోత్సాహం వారి భుజం తట్టేటట్లు ఉంటే?.. అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. ప్రభుత్వం అలాంటి ప్రయత్నమే మొదలు పెడుతోంది. అంతరాలను అధిగమింపజేసి శిఖరాలను అందుకునేలా అంకురాలకు (ఎంట్రప్రెన్యూర్స్) పదును పెట్టబోతోంది. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూ ర్' దిశగా వేసిన అడుగే 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)'లు. ఇవి యువతలో ఉన్న సృజనకు చుక్కాని కానున్నాయి. ప్రభుత్వం యువత విషయంలో ఓ వైపు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తూనే.. మరోవైపు సొంత కాళ్లపై నిలబడి పదిమంది జీవితాలను కూడా ఉన్నత స్థాయికి తీసుకెళ్లే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఊతంగా నిలబడుతోంది. ఆకలేస్తే చేపను ఇవ్వడం కంటే.. చేపను పట్టడం నేర్పితే ఆకలికి అవకాశం ఉండదని పెద్దలు ఏనాడో చెప్పారు కదండీ!. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.





పనులు చేస్తున్న దృశ్యం

ఏమిటీ హబ్‌లు?

ప్రైవేటు భాగస్వామ్యంతో యువతలో ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టడం ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం ఈ హబ్‌ల ముఖ్య ఉద్దేశం. యువతలో మెరిసిన ఆలోచనను ఒడిసి పట్టుకొని మెరుగుపెడితే వారి ఎదుగుదలతోపాటు అభివృద్ధి, జీవన ప్రమాణ మెరుగుదలకు ఉపయోగపడే ఎన్నో నూతన విషయాలకు రూపం పోయవచ్చు. ఈ దిశగా ప్రయత్నాలు చేయడం కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు చేయడం, సవాళ్లను ఎదుర్కోవడం, అధిగమించడం వంటివి చేయడంలో యువతకు, పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాలను తొలగించి వారధిగా అవి నిలుస్తాయి. ఇప్పటికే ఆర్‌టీఐహెచ్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటాగ్రూప్, టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారు. పారిశ్రామిక దిగ్గజాలైన ఓఎన్‌జీసీ, టాటా గ్రూప్, ఎల్‌అండ్‌టీ, రేమండ్, అదానీ పోర్ట్సు, ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్, గెయిల్ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆర్‌టీఐహెచ్‌ని సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు సంకల్పంతో ఈ హబ్‌లు ఏర్పాటు అవుతున్నాయి. ఈ కలను సాకారం చేయడానికి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకు రావాలని ఇప్పటికే ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఏపీ హబ్‌ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఆ హబ్‌కి గొప్ప వ్యక్తి పేరు పెట్టాలని సంకల్పించి 'రతన్ టాటా' పేరు పెట్టారు.

యువతకు పూర్తి సహకారం

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు యువత భవితకు భరోసా అని చెప్పవచ్చు. స్టార్టప్‌లతో వచ్చే యువతకు పూర్తి సహకారం అందించే మార్గాన్ని చూపుతారు. మహిళలు, యువత, నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి ద్వారా పోటీతత్వంతో మార్కెటింగ్ చేసుకొనే విధానాలపై అవగాహన కల్పిస్తారు. హబ్‌ల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక బాధ్యత కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వం అందించే వివిధ పౌర సేవల్లోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, కృత్రిమ మేధ వంటి రంగాల్లోని స్టార్టప్‌లకు సహకారం అందిస్తారు. వ్యవసాయం, ఆక్వా, మెరైన్, టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదన ఇంధనం, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తారు. పట్టణ పౌర, వాణిజ్య రవాణా, జలరవాణా, గ్రామీణ మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణ ఇస్తారు. నైపుణ్యాలను వెలికితీసి అభివృద్ధి చేస్తారు.

రాజమహేంద్రవరంలో ఏర్పాటు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. బొమ్మూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఇప్పటికే భవనానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఉభయగోదావరి జిల్లాల యువతకు వరమని చెబుతున్నారు. గవర్నింగ్ బాడీకి గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సీడ్స్ తదితర సంస్థలు ప్రమోటర్లుగా వ్యవహరించనున్నారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ హబ్‌ల్లో కృషి జరుగుతుంది. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంతోపాటు హబ్ ఏర్పాటు అదృష్టం రాజమహేంద్రవరానికి దక్కింది. దీంతో చారిత్రక నగరం భవిష్యత్తుల్లో స్టార్టప్‌లకు కీలక కేంద్రంగా మారే అవకాశం కనిపిస్తోంది. యువతకు ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, నూతన పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా రాజమహేంద్రవరం ఆర్ఐటీహెచ్ ముందుకు సాగనుంది. ఈ హబ్‌లో కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం ద్వారా విధులు నిర్వర్తించే యువత ఇక్కడినుంచి పనిచేసుకునే వెసులుబాటును కల్పించనున్నారు. కొన్ని సదుపాయాలకు రుసుములు విధించే అవకాశం ఉంది. కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పూర్తిగా దృష్టిసారించారు. సహ-ప్రమోటర్లు, ప్రతినిధుల నుంచి ఐదుగురు అధ్యక్షులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో కూడిన బృందాన్ని నియమించారు. నిర్వహణతోపాటు భాగస్వామ్యం, కార్పస్ ఫండ్, రూ.30 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి విధి విధానాలు త్వరలోనే ప్రకటించనున్నారు. యువత తమ ఆలోచనలకు పదును పెట్టి 'ఆర్ఐటీహెచ్'లను ఒడిసి పట్టుకొంటే బంగారు భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మార్గం సుగమమైనట్లేనని చెప్పడంఅతిశయోక్తి కాదు.

బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం

● కల్యాణోత్సవాల్లో ప్రత్యేక పూజలు ● భక్తుల కోలాహలం

మామిడికుదురు, జూన్7(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాలు, శనివారం కావడంతో దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాచార్యులు, వేదపండితులు జోస్యుల సోమయాజులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, శ్రీవారికి సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమాలు, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్టి, సదస్యం, వేద పారాయణం, నిత్య హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు.



బాలబాలాజీ సన్నిధిలో భక్తుల రద్దీ

ఉభయ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది వేదపండితుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం వేద సదస్యం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. శనివారం స్వామివారిని 580మంది భక్తులు దర్శించుకుని, నిత్యాన్నదాన పథకంలో 3500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,16,615 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం చేస్తున్న పండితులు

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులువిశేషపూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,39,087 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



విశేష అలంకరణలో శృంగార వల్లభ స్వామి

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం





వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ, స్వామి వారు

ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాల భోగం నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా వెంకన్న క్షేత్రంలో నవ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు మూడో రోజు శనివారం నిర్వహించారు. వేదపారాయణం, పల్లకి మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. శనివారం ఆలయం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. భక్తుల క్యూ వద్ద కూలర్లు, ఫ్యాన్లు, దాహార్తి తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయ ప్రకార మండపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తుల సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రతి శనివారం సుమారు 50నుంచి 60వేల మంది స్వామిని దర్శించుకుంటున్నారని, 20 నుంచి 30 వేల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారన్నారు. త్వరలోనే భక్తులకు డార్మిటరీ నిర్మాణం, వసతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, సోలార్‌లైట్లు, ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు ఉపకమిషనరు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ముదునూరి వెంకట్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు

కోటసత్తెమ్మ సన్నిధిలో బూరుగుపల్లి పూజలు



పూజలు చేస్తున్న శేషారావు దంపతులు

నిడదవోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిమ్మ రాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మ వారిని శనివారం రాష్ట్ర స్కిల్ డెవలప్మెంటు కార్పొ రేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు తన కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషారావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ దేవులపల్లి రవిశంకర్ ఆలయ ఆచార ప్రకారం శేషారావు దంపతులను సత్కరిం చారు. కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యా రావు, దేవస్థానం సూపరింటెండెంట్ జల్లా సోమరాజు పాల్గొన్నారు.

పేపర్‌లెస్ డాక్యుమెంట్ల విధానాన్ని రద్దు చేయాలి

ఏపీ దస్తావేజు లేఖరుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బీఎస్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలుకు సిద్ధం చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయితే ఇప్పుడు ఇదే చట్టాన్ని కేంద్రం పేపర్ లెస్ డాక్యుమెంట్ పేరుతో మళ్లీ తెరమీదకు తీసుకువస్తుందన్నారు. ఈ విధానంపై ఈనెల 25 లోపు దస్తావేజు లేఖర్ల అభ్యంతరాలు తెలియజేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందన్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించుకున్నామన్నారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న విధానం వల్ల రాష్ట్రంలో లక్షకు పైబడి దస్తావేజు లేఖరులు, వారిపై ఆధారపడి జీవనం సాగించే కంప్యూటర్ ఆపరేటర్లు రోడ్డున పడతారన్నారు. దస్తావేజు లేఖర్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లిమిల్లి వీర్రెడ్డి మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో పేపరులెస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతులు అందిస్తామన్నారు.సమావేశంలో లేఖర్ల సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ బీజే ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదే రవికుమార్, సంఘం జేఏసీ సభ్యుడు మజ్జి గణపతిరావు, ఎస్‌హెచ్‌వీ రామకృష్ణ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కోలా రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మా ర్కులకు గాను 467 మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారన్నారు. 466 మార్కులకు పైన 155 మంది, 465కు పైన 506 మంది, 463కు పైన 1224 మంది 460కు పైన 1775 మంది, 450కు పైన 2604 మంది సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు 437 మార్కులు మోహ్మద్ మనీష, గంగేయుల కృష్ణ చందన, కాడా గాయత్రి, గంపల వీర వెంకటలక్ష్మణ్ సాధించారు. 435 మార్కులు పైన 90 మంది, 430కు పైన 292 మంది, 400కు పైన 501 మంది సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బెటర్‌మెంట్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యుత్తమ మార్కులు సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 12మంది విద్యార్థులు 470 మార్కులకు గానూ 466 మార్కులు సాధించారన్నారు. అలాగే 54మంది విద్యార్థులు 465 మార్కులను, 79మంది 464 మార్కులను పొందినట్టు తెలిపారు. బైపీసీలో 440 మార్కులకుగానూ ఇద్దరు విద్యార్థినులు 436 మార్కులను, తొమ్మిది మంది 435, ఏడుగురు 434 మార్కులు, ఎనిమిది మంది 433 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో 500 మార్కులకుగానూ ఒక విద్యార్థి 493, ఇద్దరు 492, ఇద్దరు 491, ఇద్దరు 490 మార్కులు పొందినట్టు తెలిపారు. సీఈసీలో 500 మార్కులకు గానూ ఒకరు 491, ఒక విద్యార్థి 483 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

కొవ్వూరు మున్సిపాల్టీ కూటమి కైవశం

- వైసీపీకి మున్సిపల్ ఛైర్‌పర్సన్, ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా
- టీడీపీలో చేరనున్నట్లు ప్రకటన
- మెజార్టీ కోల్పోయిన ప్రతిపక్షం



అచ్చిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఛైర్‌పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వశమైంది. తాజాగా వైసీపీకి చెందిన నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కొవ్వూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, 3వ వార్డు కౌన్సిలర్ వరిగేటి లలితకుమారి, 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్, వరిగేటి సుధాకర్ వ్యక్తిగత కారణాలతో, పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు శనివారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆసక్తితో తెలుగుదేశం పార్టీలో చేరునున్నట్టు ప్రకటించారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో నలుగురిని పార్టీలో చేర్చుకోనున్నట్టు తెలిపారు.

మెజార్టీ కోల్పోయిన వైసీపీ

కొవ్వూరు మున్సిపాల్టీలో 23 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో వైసీపీ 15, టీడీపీ 7, బీజేపీ 1 వార్డు గెలుచుకున్నాయి. వైసీపీ నుంచి ఛైర్‌పర్సన్‌గా బావన రత్నకుమారి ఎన్నికయ్యారు. తాజాగా శనివారం వైసీపీ నుంచి 4 కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. అందులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఒకరు. దీంతో వైసీపీ బలం 15 నుంచి 11కి పడిపోగా టీడీపీ సంఖ్య 11కు చేరింది. బీజేపీ 1, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో కలుపుకుని కూటమి బలం 13కు చేరింది. దీంతో కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వసం అవ్వడం దాదాపుగా ఖరారయ్యింది.

కొవ్వూరులో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. పార్టీ మారడంలో ఎవ్వరి ప్రలోభాలు లేవని, పూర్తిగా తమ సొంత నిర్ణయమన్నారు. కొవ్వూరు పట్టణాభివృద్ధిని కాంక్షిస్తూ కూటమి ప్రభుత్వం విధివిధానాలతో నచ్చడంతో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు పేర్కొన్నారు.

'వైసీపీలో బీసీలకు సముచిత స్థానం లేదు'

10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ 2014, 19, 24 మూడు ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేశాను. ప్రస్తుతం కౌన్సిలర్‌గా పనిచేస్తున్నాను. వైసీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 15వార్డులు విజయం సాధించి మున్సిపాల్టీని కైవసం చేసుకున్నప్పటికీ ఛైర్పర్సన్ ఎస్సీలకు రిజర్వు అయ్యింది. 2 వైస్‌ఛైర్మన్ పదవులు ఉండగా రెండూ ఓసీలకే కట్టబెట్టారు. అలాగే ఇటీవల నియోజకవర్గంలో పట్టణ, మూడు మండలాల అధ్యక్షులను మార్పుచేశారు. 3 మండలాల్లో ఏ సామాజికవర్గం అభ్యర్థిని మార్చితే అదే సామాజికవర్గం వారిని నియమించారు. కొవ్వూరులో అధ్యక్ష పదవి నుంచి బీసీ అభ్యర్థిని తొలగించి ఓసీలకు కట్టబెట్టారు. దీంతో మనస్థాపం చెంది వైసీపీకి రాజీనామా చేసి అన్నిరంగాలలో బీసీలకు పెద్దపీట వేస్తున్న తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానన్నారు.

15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ వార్డు ప్రజలు, అభిమానుల కోరిక మేరకు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నామని చెప్పారు.

కాకినాడలో
మెగా యోగా

- రికార్డుస్థాయిలో ఏడువేలమందితో యోగాసనాలు
- ఆకట్టుకున్న ఓంకారం.. కిలోమీటరు మేర కార్యక్రమం
- యోగాసనాలు వేసిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు, యువత
- ప్రతిఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్





యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు..



యోగాపై వివరిస్తున్న రామానంద

ఓంకార రూపంలో ఏర్పడిన దృశ్యం



యోగా చేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ



జేసీ రాహుల్‌మీనా



కమిషనర్ భావన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడువేల మందితో యోగాంధ్ర కార్య క్రమం నిర్వహించి రికార్డు సాధించారు. కాకినాడ నగరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎల్‌బీసీ భవనం వరకు కిలోమీటరు మేరకు ఏడువేల మందితో శనివారం నిర్వహించిన మెగా యోగా కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ అంత ర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గ దర్శకాల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఏడువేలమంది హాజరయ్యారన్నారు. ఈ యోగా సాధన కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యజీవితాల్లో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా ను రోజూ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వహించే ందుకు యోగా దోహదపడుతుంద న్నారు. ఈనెల 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలో యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధు లను భాగస్వా మ్యం చేసుకుంటామ న్నారు. శనివారం జరిగిన యోగా కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

యోగతో ఆరోగ్యం..

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడు తూ ప్రతిఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరమని, నిత్యం వివిధ రకాల మందులు వాడి ఆరోగ్యం పాడుచేసుకోకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమ న్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రం అంతటా పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉంద న్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వన మాడి కొండబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతోనే నెలరోజులపాటు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందించారన్నారు. సీఎం చంద్రబాబు 40 ఏళ్ల నుంచి యోగా సాధన చేయడం వల్లే ఇంకా ఎంతో ఆరోగ్యవంతంగా పని చేస్తున్నారన్నారు. యోగా శిక్షకుడు రామానంద అందరితో ఆసనాలు వేయించారు. అనంతరం యోగా శిక్షకులు రామా నందతోపాటు వేదికపై యోగాసనాలు వేసిన చిన్నారులను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఉపాధ్యాయులు, అధికారులు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకానికి వచ్చి.. ప్రమాదంలో చిక్కి..



ప్రమాదం నుంచి బయపడిన యువకులు

- సీలేరు నదిలో నలుగురు యువకులను కాపాడిన పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు
- మరో యువకుడి గల్లంతు



గల్లంతైన అభిలాష్ (ఫైల్‌ఫోటో)



నదిలో చిక్కుకున్నవారిని తాళ్ల సాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పర్యా టక ప్రాంతాల సందర్శనకు వచ్చిన యువకులు ప్రమాదంలో చిక్కుకున్న సంఘటన అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధిలోని ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన 20 మంది తాపీ పని చేసే వ్యక్తులు శనివారం ఉదయం చింతూరు మండలం మోతుగూడెం పర్యాటక ప్రాంతాల సందర్శనకు రెండు టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చారు. మోతుగూడెం ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో నది మధ్యలోకి ఐదుగురు యువకులు వెళ్లి స్నానానికి దిగారు. అదే సమయంలో పొల్లూరు జల విద్యుత్‌కేంద్రంలో జెన్‌కో ఉన్నతాధికారులు విద్యుదుత్పత్తిని ప్రారంభించటంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో యువకులు రాళ్లపైకి చేరి రక్షించడం అంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ఒంటిగంట సమయంలో జనరేషన్ నిలిపివేశారు. ఎస్‌ఐ ఎస్‌కే సాధిక్, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, గజ ఈతగాళ్లు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు, గుత్తేదారు కార్మికులు, స్థానిక యువకులు నది ప్రవాహం మధ్యలో చిక్కుకుపోయిన పి.సుధీర్, కె.నాగేంద్ర, సి.రామకృష్ణ, బి.ప్రభులను తాళ్ల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చి కాపాడారు. అభిలాష్ (18) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఆ యువకుడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఊడిన టైరు.. అదుపుతప్పిన లారీ



ఊడిపోయిన లారీ టైరు

శంఖవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా రావికంపాడు వెళ్తున్న లారీ టైరు ఊడిపోవడంతో అదుపుతప్పి గోడను ఢీకొంది. లారీ లోడుతో రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులు రౌతులపూడి వెళ్లే వాహనాలను గౌరంపేట మీదుగా మళ్లించారు. సంఘటనా స్థలాన్ని స్థానిక టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పరిశీలించి వందలాదిగా గ్రామాల్లో లారీలు తిరగకుండా చర్యలు చేపట్టాలని, విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో రాకపోకలు నిలిపివేయాలని పోలీసులను కోరారు.

లారీ బోల్తా

ఏలేశ్వరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం పరిధి చిన్నింపేటలో శనివారం లారీ బోల్తా పడింది. జాతీయ రహదారిపై పంటపొలాల్లోకి వెళ్లిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. విశాఖపట్నం పోర్టు నుంచి జిప్సం లోడును కర్ణాటకకు ఈ లారీ తీసుకెళ్తోంది. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.



వంద కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి వయా చింతూరు మీదుగా వంద కిలోల గంజాయి తరలిస్తూ శనివారం ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా కథనం మేరకు.. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని తూలుగొండకు చెందిన కరణం రామాంజనేయులు, ఆరెళ్ళ బొజ్జి ఒడిస్సాలోని కొవ్వాసి తాతారావు వద్ద వంద కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వయా చింతూరు మీదుగా కారులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని షేక్ సుభానికి గంజాయి చేరవేసేయత్నంలో పట్టుబడ్డారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కరణం రామాంజనేయులు, కొవ్వాసి తాతారావు, షేక్ సుభానీపై చింతూరు, డొంకరాయి పోలీసు స్టేషన్లలో ఇప్పటికే గంజాయి తరలింపు కేసులు ఉన్నాయని, వీరంతా గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ తెల్లం దుర్గాప్రసాద్, చింతూరు ఎస్‌ఐ వి.రమేష్, మోతుగూడెం ఎస్‌ఐ షేక్ సాధిత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సాయి (ఫైల్)

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకి నాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. నర్సీపట్నం రోడ్డు- గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్యలో వ్యక్తి పట్టాలు దాటుతుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు ఢీకొని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని తుని రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. మృతుడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయపూడి గ్రామానికి చెందిన సాయి అని తెలిపారు. మృతుడికి తల్లి, తండ్రి భార్య ఉన్నారు. అతడికి ఆరునెలల క్రితమే వివాహమైందని బంధువుల ద్వారా తెలిసిందన్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని మృతుడి సంబంధీకులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



ప్రాకారసేవలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. పండితుల మహదాశీర్వచనం అనంతరం తిరిగి ప్రధానాలయానికి స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు తదితరులున్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం గుంటూరుకు చెందిన తోట రిషితశ్రీ 1,00,011 విరాళాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత

పేదలపై ఫీజులుం..

- పేద విద్యార్థులతో ప్రైవేటు స్కూల్స్ ఆటలు
- పలు యాజమాన్యాల అతి తెలివి
- అదనపు ఫీజులతో తల్లిదండ్రులు బెంబేలు
- ఒకటో తరగతి సీటని.. యూకేజీ అడ్మిషన్

రాజమండ్రికి చెందిన ఓ మెకానిక్ తన కొడుకును 1వ తరగతిలో చేర్పించడానికి ఆర్టీఈ చట్టం 12 (1)సీ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. తమ స్కూల్‌లో సీటు కేటాయింపు జరిగిందని, స్వయంగా వచ్చి మిగతా ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఓ కార్పొరేటు/ప్రైవేటు స్కూల్ నుంచి ఆయనకు ఎస్‌ఎంఎస్ వచ్చింది. పిల్లాడిని తీసు కుని ఆ స్కూల్‌కి వెళ్లాడు. అక్కడ విద్యార్థి చదువు, సామర్థ్యాన్ని పరీక్షించారు. అయితే ఆ పిల్లాడి లెవెల్స్ తమ స్కూలు స్టాండర్డుకు సరిపోదని చెప్పగా ఆ పేద తల్లిదండ్రులు కంగుతిన్నారు. వాళ్లు తేరు కోకముందే.. 'మీ పిల్లాడిని ఇక్కడే ఈ ఏడాది యూ కేజీలో జాయిన్ చేయండి. ఫీజు రూ.45వేలు' అని సెలవిచ్చారు. తమ కొడుకు పట్ల శ్రద్ధ వహిస్తామని ఆ తల్లిదండ్రులు ప్రాథేయపడగా సరే అన్నారు.




(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు స్కూల్స్ వ్యాపార యావ.. చదువుకునే హక్కును కూడా చదువుకునేవిధంగా మార్చేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) అపహాస్యం చేస్తోంది. సామాజిక బాధ్యత మాట అటుంచితే ఆయా పాఠశాలల యాజమాన్యాల తెలివి తేటలకు పేద పిల్లల తల్లిదండ్రులు కళ్లు తేలేస్తున్నారు. ఇప్పటికే ఫీజుల మోత మోగిస్తున్న ప్రైవేటు పాఠశాలలు.. పేద విద్యార్థుల నుంచి కూడా ఏదో రకంగా దండుకోవాలని చూస్తున్నాయి. అన్నీ కాకపోయినా అధిక శాతం ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల పేదరికంతో ఆడుకుంటున్నాయి. తమ పిల్లాడికి కార్పొరేట్ స్కూల్లో ఉచితంగా సీటు లభించిందని ఆనందిస్తున్న తల్లిదండ్రులకు తీరా స్కూల్‌లో అడుగుపెట్టాక సొమ్ముల లెక్కలతో చుక్కలు చూపిస్తున్నారు. ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ నిరుపేద తల్లిదండ్రులు కన్నీటిని ఆశ్రయిస్తున్నారు. ఫీజు సంగతి ఎలా ఉన్నా.. అదనపు డబ్బులు చెల్లిం చుకోడానికి అప్పుల కోసం తిప్పలు తప్పడం లేదు.

తడిసి మోపెడు

విద్యా హక్కు చట్టప్రకారం ప్రతి కార్పొరేట్ స్కూల్‌లో ప్రతి ఏడాది ఒకటో తరగతిలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. అమ్మ ఒడి/తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రభు త్వం విద్యార్థుల తల్లికి ఇచ్చే డబ్బులను ఆ స్కూల్‌కి ఫీజు కింద చెల్లిస్తారు. ఈ విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆరు దశల ప్రక్రియ అనంతరం విద్యార్థి కోరుకున్న, ఇంటికి కాస్త దగ్గరగా ఉన్న స్కూ లును కేటాయిస్తారు. ఇదంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. కేటాయింపు మెసేజ్ సదరు విద్యార్థి పేరెంట్స్‌కి వెళుతుంది. తర్వాత స్కూల్‌కి వెళ్లి తదుపరి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉం టుంది. అయితే ఇక్కడే కొన్ని పాఠశాలలు ఇబ్బందులకు



గురి చేస్తున్నాయి. బస్సు, యూనిఫాం, షూ, టై, ఆ రుసుము, ఈ ఫండు అంటూ తడిసి మోపెడు ఫీజును తల్లిదండ్రుల నెత్తి మీద పెడుతున్నారు. దీంతో ఆ పేద తల్లిదండ్రులకు ఏమీ పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది. ఆ మాత్రం డబ్బులు కట్టలేని వాళ్ళకు కార్పొరేట్ చదువు ఎందుకంటూ చులకన మాటలను కూడా తల్లిదండ్రులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



ఇదో రకం సమస్య

గతంలో నేరుగా ఒకటో తరగతిలో చేర్చేవారు. తర్వాత ఎల్‌కేజీ, యూకేజీలు వచ్చి చేరాయి. ఆ కేజీలు అన్ని చోట్లా ఒకే విధంగా ఉండవు. కాస్త చిన్న కాన్వెంట్లలో తక్కువస్థాయిలో చదువు ఉంటుందన్న విషయం తెలిసిందే. పలువురు తల్లిదండ్రులు చిన్న పిల్లలు కదా.. అప్పుడే చదువు పేరుతో రుద్దడం ఎందుకని ఆలోచించడం వల్ల కూడా ఏబీసీడీల్లో సైతం వెనుకబడుతున్నారు. దీంతో కార్పొరేట్ స్కూల్‌లో ఒకటో తరగతిలో చేర్చే సమయం వచ్చినపుడు ఈ పిల్లాడి స్థాయి కార్పొరేట్ చదువును అందుకోలేక పోతోంది. తరగతిలో పిల్లలందరిదీ ఒకరకం స్థాయి ఉంటే ఈ పిల్లలకు తక్కువ చదువు ఉంటోంది. దీంతో స్కూల్ యాజమాన్యాలు కూడా చేర్పించుకోవడానికి వెనుకడుగు వేస్తున్నాయి. తమ పిల్లలకు సరిగా చదువు చెప్పడం లేదనే మాట భవిష్యత్తులో తల్లిదండ్రుల నుంచి పడాల్సి వస్తుందని భయపడుతున్నాయి. చదువులో వెనుకబడిన వారిని తీర్చిదిద్దడమే అసలైన విద్యా నేర్పరితనం అనే వాదన వినవస్తోంది.

ఇబ్బంది ఉంటే చెప్పండి

ఆర్టీఈ చట్ట ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించిన సీట్లలో కచ్చితంగా చేర్పించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే విద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలి. అలాగే విద్యార్థుల చదువుపై తల్లిదం డ్రులకు కూడా శ్రద్ధ వహించే బాధ్యత ఉంటుంది. కాస్త పికప్ అయ్యే వరకూ ట్యూషన్ పెట్టించడం, ఇంట్లో పట్టించుకోవడం వంటివి చేస్తే మంచిది. ఇబ్బంది పెడుతున్నారని మాకు ఫిర్యాదులు రాలేదు. ఒకవేళ వస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాధికారి, తూర్పు గోదావరి

10 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కాకినాడ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయుజీకెవై సెంటర్‌లో ఈ నెల 10వ తేదీ మంగళవారం నుంచి వికాస ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభంకానున్నాయని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టూ వీలర్ టెక్నీషియన్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ సోమవారం లోపు సెల్ నంబర్లు 8328483297, 89784 75164లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పీడీ తెలిపారు.

కొనసాగుతున్న వాకతిప్ప చోరీ కేసు దర్యాప్తు

కొత్తపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఇటీవల జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. వాకతిప్పకు చెందిన పేరూరి శ్రీనివాసరావు మాస్టారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులను మారుతాళాలతో తెరచి సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20లక్షల నగదు చోరీకి గురైన విషయం విదితమే. ఇంట్లో సీసీ కెమెరా పుటేజీలో ఇద్దరు వ్యక్తులు తలుపులు బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించారనే విషయం రికార్డు కావడంతో ఆయా పుటేజీల ఆధారంతో నిందితులు ఎవరనే విషయాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ చెప్పారు. నాలుగైదు రోజుల్లో కేసు కొలిక్కి రావచ్చునని ఎస్‌ఐ అభిప్రాయం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దౌర్జన్యం

కేసు నమోదు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుకుంటున్న వ్యక్తిపై దౌర్జన్యం చేసి కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెచ్‌సీ లలితకుమారి తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన కొండాక తరుణ్ టాటాక్యాపిటల్ మైక్రో ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన కొవ్వూరు మండలం వాడపల్లి వచ్చి గెల్లా లక్ష్మీ అనే ఆమె వద్ద ఈఎంఐ కట్టించుకుని వెళ్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలబడి ఫోన్ మా ట్లాడుతున్నాడు. ఇంతలో స్థలం యజమాని గెల్లా సతీష్ నా స్థలంలోకి ఎందుకు వచ్చావు అంటూ దౌర్జన్యం చేసి దుర్భాషలాడుతూ సెల్‌ఫోన్ లాక్కొని తలపై కొట్టి గాయపర్చాడు. స్థానికులు గాయపడిన తరుణ్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వచ్చిన సమాచారం మేరకు తరుణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలితకుమారి పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కత్తితో దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన పోతుల వెంకటేష్ శనివారం రాత్రి తన కొడుకుని కొడుతున్నాడు. పక్కఇంటిలో ఉంటున్న మల్లిన సతీష్ ఎందుకు పిల్లాడిని అలా కొడుతున్నావని అడిగాడు. దీంతో వెంకటేష్ కత్తి తీసుకువచ్చి నా కొడుకుని కొడుతుంటే నీకెందుకు అంటూ చెవిపై గాయపర్చాడు. గాయమైన సతీష్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు సతీష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన్టు సీఐ పి.విశ్వం పేర్కొన్నారు.

నేడు పుదుచ్చేరిలో జేఈ రాత పరీక్ష

యానాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ఆదివారం పుదుచ్చేరిలో రాత పరీక్ష జరగనుంది. పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానానికి చెందిన అభ్యర్థులు పుదుచ్చేరిలో ఆదివారం జరిగే రాత పరీక్షకు హాజరుకానున్నారు. పాలనాయంత్రాంగం అన్నిఏర్పాట్లు చేసింది.

పేకాట శిబిరంపై దాడులు

ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. శనివారం రావిచెట్టు సెంటర్‌లోని ఒక ఇంట్లో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపి, ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3400 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

మాన్యువల్‌గా బదిలీలు చేపట్టాలని సెకండరీ గ్రేడ్ టీచర్ల ధర్నా




అమలాపురం: ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధుల నిరసన, ముమ్మిడివరం: వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమలాపురంరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని మాట ఇచ్చి అకస్మాత్తుగా వెబ్ కౌన్సిలింగ్‌కు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు శనివారం అమలాపురం మండల మానవ వనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించడం కష్టమని, అధికారులు ప్రకటన చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ మేరకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సరిదే సత్యపల్లంరాజు, నరేష్, మొయినుద్దీన్, నందెపు శ్రీనివాస్, నాగేంద్రగౌడ్, పెన్నాడ శ్రీనివాస్, కొమ్ముల సత్యరమేష్, మోటూరి శ్రీనివాస్, కొప్పిశెట్టి మేరీమాత, సత్యభాను, సీహెచ్‌వీ కృష్ణమూర్తి, కాలెపు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ముమ్మిడివరంలో సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యా కార్యదర్శి కోన శశిధర్‌తో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో జరిగిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చినా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని పేర్కొనడంపై వారు నిరసన వ్యక్తం చేశారు. మాన్యువల్ కౌన్సిలింగ్ మాత్రమే జరపాలని సంఘం డిమాండ్ చేసింది. ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేసి ఎంఈవో ఆర్.ఉదయభాస్కరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, పి.హిమబిందు, సీహెచ్ భైరవస్వామి, రెడ్డి నాగార్జునరావు, ఎంవీ రాంబాబు, కె.ఉమామహేశ్వరరావు, ఆర్బీవీ రమణ, కె.రాము, కేవీఎస్ నారాయణ, కేఎస్ నాగరాజు, ఎన్.నాగరాజు, యు.దశరథరామయ్య, పీఎల్ కృష్ణమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల్లో సెంకడరీగ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని అంగీకరించి, ఇప్పుడు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోమనడం హామీలను ఉల్లంఘించడమేనని సెంకడరీ గ్రేడ్ టీచర్లు పేర్కొన్నారు. మలికిపురంలో శనివారం జరిగిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో పలువురు టీచర్లు మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. చాలామంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్‌సైట్‌లో తప్పనిసరి బదిలీగా చూపడంతో వారికి బదిలీలకు ఆప్షన్ లేకుండా పోయిందన్నారు. సమస్యలను విద్యాశాఖ మంత్రి వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ఎల్.సాయిశ్రీనివాస్, సీహెచ్ మంజుల, చిరంజీవి, కృష్ణయ్య, బాలాజీ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా ఎస్జీటీలకు బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు శనివారం మామిడికుదురు ఎమ్మార్సీ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలం పెద్దిరాజు, జి.నాగప్రసాద్, వై.పల్లంరాజు, వైవీ సత్యనారాయణ, షబ్బీర్ హుస్సేన్, పీఆర్కే గణపతిరావు, అరవ సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్, పీఆర్‌సీయూ, ఆప్కాస్ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట యూటీఎఫ్, ఎస్టీయూ సంఘాల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 19,20తేదీల్లో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో సెకండరీ గ్రేడ్‌ఉపాధ్యాయులకు మాన్యు వల్‌గా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లకు ఇప్పటివరకు నిర్వహించిన బదిలీలు, పదోన్నతుల్లో అనేక సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తడంతో అనేక మంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. యూటీఎఫ్, ఎస్టీయూ సం ఘాల నాయకులు వరిగేటి రత్నం, కాపవరపు గోపాల కృష్ణ, నల్లా బాలాజీ, డి.రామకృష్ణ, బళ్ల శ్రీనివాస్, గిడ్ల శ్రీను, ముద్రగడ్డ జగదీశ్వరరావు, కడలి శివరామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు కత్తుల ఆనందరావు, కేవీ లక్ష్మణరావు, నీతిపూడి శ్రీని వాసరావు, నక్కా ప్రసాద్, బీవీఎస్ఎన్ రాజు, మీర్ తలాబ్‌ఆలీ, ఎంవీ రమణారావు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపమే బక్రీదు

- భక్తిశ్రద్ధలతో బక్రీద్
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు




అమలాపురం మొల్లా ముస్తాఫా మసీదులో ప్రార్థనలు, మామిడికుదురులో బక్రీదు ప్రార్థనలు

అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. అమలాపురం మొల్లాముస్తాఫా మసీదు, జామియా మసీదుల్లో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. మొల్లాముస్తాఫా మసీదులో ఇమామ్ మొహమ్మద్ రజ్జా, జామియా మసీదులో ఇమామ్ అజీజుల్‌రెహ్మాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బక్రీదు పండుగ విశిష్టతను వివరించారు. హజరత్ ఇబ్రహింను స్ఫూర్తిగా తీసుకుని సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో మెలగాలని సూచించారు. సాటి మనుషులను ప్రేమించేవారే నిజమైన దైవ భక్తులన్నారు. ఆయా మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈద్ ముబారక్ చెప్పుకుని ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమాల్లో మసీదు పెద్దలు ఎండీ అమీర్, ఎండీ ఆజామ్, ఎండీ బషీర్, ఎంఎంకేజీ మొయినుద్దీన్, ఖాదర్‌వలీ, జీఎం ఖాన్, ఎండీ నిజాముద్దీన్, ఎస్‌కే రాజేష్, ఎస్‌కే ఫిరోజ్, ఎండీ షరీఫ్, కరీముల్లాబాబా, షఫి, అహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పెద్దవీధిలో ఉన్న అంజుమానేఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సెంటర్ మీదుగా ఖబర్‌స్తాన్‌కు చేరుకుని అక్కడ దివంగతులైన మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ.రఫీ, రఫీ, కరీం, వలీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మానవాళిని జాగ్రత పరిచి మనలో త్యాగనిరతిని చాటిచెప్పే ముస్లింల పండుగ బక్రీదు అని జామియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అలీ అన్నారు. రాజోలు యూత్‌క్లబ్ ఆవరణలో బక్రీదును శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షేక్ బాజీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, షాబుద్దీన్, మొల్లాసర్దార్, రెహ్మాన్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): బక్రీదును ముస్లింలు ముమ్మిడివరంలో మజ్జిదే జహెరాలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముమ్మిడివరం ముస్లింవీధిలో ఉన్న మజ్జిదే జహెరాలో శనివారం ఈద్-ఉల్-అదా నమాజులు నిర్వహించారు. బక్రీదు పండుగను పురస్కరించుకుని అధిక సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక నమాజులు చేశారు. నగరం నుంచి విచ్చేసిన మతగురువు మౌలానా మీర్జ అక్బర్‌షా బక్రీదు సందేశాన్ని ఇచ్చారు. ఇబ్రహీం అలైహిస్సలాం, ఇస్మాయిల్ అలహిస్సాలాం చేసిన గొప్ప త్యాగ ఫలితమే బక్రీదు అన్నారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్‌లు తెలుపుకున్నారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): బక్రీదు వేడుకలను ముస్లింలు ఆనందోత్సాహాల మధ్య శనివారం జరుపుకున్నారు. త్యాగాలకు ప్రతీకైన బక్రీదును పురస్కరించుకుని మామిడికుదురులోని సున్నీ, షియా జామియా మసీదుల్లో ప్రత్యేక నమాజులు జరిగాయి. మత ప్రబోధకులు తారిక్‌అన్వర్‌రజ్వీ, మహ్మద్ ఇబ్రహీంలు బక్రీదు ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. మొగలికుదురు, నగరం, పెదపంజీషలోను నమాజులు జరిగాయి. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మురుగునీటి సమస్యతో ఇబ్బంది

- రెండు మండలాలకు చెందిన నాలుగు గ్రామాల రైతులకు నష్టం
- 300 ఎకరాల్లో ఖరీఫ్ వరి పంటకు ముంపు
- డ్రెయిన్‌ను ఆధునికీకరించకపోతే పంట విరామం దిశలో రైతులు



బొండాయికోడు మైనర్ డ్రెయిన్ తూడు పెరిగి పూడుకుపోయిన దృశ్యం

ముమ్మిడివరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రైతులు ప్రతీ ఏటా ఖరీఫ్ పంటను కోల్పోతున్నారు. మురుగునీరు బయటకు వెళ్లే మైనర్ డ్రెయిన్ ఆక్రమణలకు గురవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో అధిక వర్షం వస్తే వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ పంటను నష్టపోతున్నారు. ముమ్మిడివరం మండలం క్రాపచింతలపూడి, అయినవిల్లి మండలం క్రాప, శంకరాయగూడెం, పోతుకుర్రు గ్రామాలకు సంబంధించి సుమారు 300ఎకరాల్లోని వరి పొలాల్లోని మురుగునీరు బయటకు మైనరు డ్రెయిన్ ద్వారానే బయటకు వెళుతుంది. అయితే డ్రెయిన్ ఆక్రమణలకు గురవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయింది. డ్రెయిన్ గట్టుపై ఉన్న ఇళ్లలోని వాడకపు నీరు, లెట్రిన్ గొట్టాలను మురుగునీటి కాల్వల్లోకి వదిలేయడంతో డ్రెయిన్ అధ్వానంగా ఉంది. అయినవిల్లి మండలం క్రాప నుంచి ఏర్పాటైన ఈడ్రెయిన్ ముమ్మిడివరం మండలం బొండాయికోడు సమీపంలోని బొండాయికోడు మీడియం డ్రెయిన్‌లో విలీనం అవుతుంది. రెండు కిలోమీటర్ల పొడవు గల ఈడ్రెయిన్‌కు ఆక్వా చెరువుల రైతులు అక్కడక్కడా తూరలువేసి అడ్డుకట్టలు వేశారు. దీంతో మురుగునీటి ప్రవహానికి అవరోధం ఏర్పడింది. ఈడ్రెయిన్‌ను ఆధునికీకరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. దీనిపై డ్రైనేజీ శాఖ అధికారులకు, నీటిసంఘం ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అయినా డ్రెయిన్ ఆధునికీకరణ చేపట్టకపోతే ఖరీఫ్ పంట విరామం చేపడతామని వారు పేర్కొంటున్నారు.

ఏటా తొలకరి పంట కోల్పోతున్నాం: మోటూరి మోహనరావు, రైతు, క్రాప



ఖరీఫ్‌లో నాట్లు వేసిన నెల రోజులకే జూలై, ఆగస్టు నెలల్లో అధిక వర్షాలు వచ్చి చేలు ముంపు బారిన పడుతున్నాయి. దీంతో వేసిన నాట్లు కుళ్లిపోతున్నాయి. మళ్లీ నాట్లు వేద్దామంటే సమయం సరిపోవడం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతుంది.

పంట చేతికి వచ్చేటప్పుడు నష్టపోతున్నాం: పాటి రవికుమార్, రైతు, క్రాప



ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చే సమయంలో నవంబరు, డిసెంబరు నెలల్లో తుఫాన్లు, అల్పపీడనాలు, అధిక వర్షాలు పడడం వల్ల, గాలులు వీచడంతో వరి నేల నంటుతుంది. దీంతో ముంపు బారిన పడి పంటను నష్టపోతున్నాం. ఖరీఫ్ పంటను కోల్పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. వ్యవసాయ సేద్యం భారంగా మారుతుంది.



చౌడుమాలపల్లి వద్ద చెత్తాచెదారంతో పాటు ఆక్రమణలకు గురైన మైనర్ డ్రెయిన్

ముంపుతో పంట నష్టపోతున్నాం: పైగోడి సూర్యప్రకాష్, క్రాప, రైతు



నాలుగు ఎకరాలు చేను కౌలుకు చేస్తున్నాను. ఖరీఫ్ పంట సక్రమంగా చేతికి రాకపోవడంతో రైతులకు శిస్తు సరిపెట్టలేకపోవడం, పెట్టుబడికి తెచ్చిన సొమ్ములు తీర్చేమార్గం లేక అప్పుల బారిన పడుతున్నాం. వరి చేలో ముంపునీరు బయటకు వెళ్లే మార్గం లేక పంటకు నష్టం జరుగుతుంది. క్రాప, బొండాయికోడు మైనరు డ్రెయిన్‌ను ఆధునికీకరిస్తే వరి సాగు చేయగలుగుతాం. లేకపోతే పంట విరామం చేపట్టాల్సిందే.

వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ

అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దేశ సంక్షేమంతో పాటు వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్లుగా విశేష కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషిని వివరించారు. అమలాపురంలో శనివారం బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన మోదీ 11ఏళ్లలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి చేసిన కృషిని వివరిస్తూ జిల్లాస్థాయిలో కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోదీ సుపరిపాలనలో భాగంగా ఈనెల21న యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. 25న ఇందిరాగాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించిన చీకటి రోజులను ప్రజలు వివరించేందుకు కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5 నుంచి ఆగస్టు 5వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. యోగా ఆవశ్యకతను ప్రజలకు మరింత తెలియచేసే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి ఎస్.లక్ష్మీప్రసన్న పదకొండేళ్ల మోదీ పాలన గురించి వివరించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాలూరి సత్యానందం, మాలే శ్రీనివాసనగేష్, గనిశెట్టి వెంకటేశ్వరరావు, మోకా వెంకటసుబ్బారావు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుంతీదేవి జాతర

కె.గంగవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తామరపల్లిలో కుంతీదేవి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన గారడీ బృందాలు నృత్యాలు చేశారు.

ప్రజా చైతన్యమే ప్రజానాట్యమండలి లక్ష్యం



అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యమే లక్ష్యంగా ప్రజా నాట్యమండలి కళాకారులు చేస్తున్న కృషి చరిత్రలో నిలిచిపోతుందని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు చేస్తున్న కృషిని పలువురు వక్తలు వివరించారు. అమలాపురం ఎస్టీయూ భవనంలో ప్రజా నాట్యమండలి శిక్షణా తరగతుల ముగింపు సభకు పెద్దిరెడ్డి రాము, జి.రవి, వై.ఉమేష్‌లు నాయకత్వం వహించారు. దేశ సమైక్యతను సమగ్రతను, లౌకికవాదాన్ని చాటుతూ దేశభక్తిని పురిగొల్పేవిధంగా ఎన్నో కళాజాతాలను ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు చేస్తున్న కృషిని జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు కొనియాడారు. ఎందరో సినీ ప్రముఖులను చిత్ర పరిశ్రమకు అందించిన ఘనత నాట్యమండలిదేనన్నారు. కన్వీనర్ కొప్పుల సత్తిబాబు, ఎంఎస్ఎన్ మూర్తి, వాసంశెట్టి సత్తిరాజు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలి

11న చలో విజయవాడ

అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బి.బలరామ్ డిమాండ్ చేశారు. నూటికి 70 మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భూయజమాని సంతకం పెడితేనే కౌలు గుర్తింపుకార్డులు ఇస్తామని నిబంధనలు విధించడంతో ఎందరో కౌలు రైతులు గుర్తింపు కార్డులకు కూడా నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చి ఆదుకోవాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల11న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి నుంచి వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు. అమలాపురం శనివారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, గుత్తాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతీ కౌలు రైతుకు రూ.20వేలు ఇవ్వాలి



మామిడికుదురులో సమావేశమైన రైతు సంఘం ప్రతినిధులు

మామిడికుదురు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ప్రతీ కౌలు రైతుకు రూ.20వేలు ప్రభుత్వం ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర నాయకుడు బి.బలరామ్ డిమాండ్ చేశారు. నగరం ఏఎంసీ వద్ద జిల్లా అధ్యక్షుడు అప్పారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన కౌలురైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఉపయోగపడే చట్టాలు తీసుకురావాలని కోరారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల11న విజయవాడ మంగళగిరిలోని ఎన్నారై ఆసుపత్రి నుంచి వ్యవసాయశాఖ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం ఇస్తామని, ప్రదర్శనలో రాష్ట్రంలోని కౌలు రైతులందరూ విధిగా పాల్గొనాలన్నారు. చలో విజయవాడ కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ, తాటికాయల ఉదయ్‌భాస్కర్, రాంబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన బర్రె రాణిసంయుక్తను అగ్నికుల క్షత్రియ సేవాసంఘం అధ్యక్షుడు కొల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని సంఘం తరఫున ఆశీర్వదించారు. చిప్పల సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోటం చిన్నబ్బాయి, వైదాని సత్యనారాయణ, కొపనాతి లక్ష్మణరావు, సంగాని రాంబాబు, కొల్లు జ్ఞానేశ్వరరావు, వైదాడి వెంకటరమణ పాల్గొన్నారు.

భూలోక సత్తెమ్మ నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ



పి.గన్నవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మానేపల్లిలో శనివారం ఉదయం చంద్రమౌళిసురేష్‌శర్మ బ్రహ్మత్వంలో శైవాగామ పండితులు శ్రీభూలోక సత్తెమ్మ అమ్మవారి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, , యంత్ర ప్రతిష్ఠ జీవన్యాసం, మహాపూర్ణాహుతి, గోదర్శనం, మహాకుంభం, అమ్మవారి దివ్య దర్శనం, ఆశీర్వచనం, ఆచార్యపూజ, పండిత సత్కారాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అఖండ హరినామ సంకీర్తనకు వెళ్లిన భక్తులు

అంబాజీపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి):అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన శ్రీశ్రీనివాస భజన భక్తజన బృందం తిరుమలకు బయలుదేరారు. టీటీడీ ఆహ్వానంతో ఈనెల9న ఆలయం సన్నిధిలో చేపట్టే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు గురువు వాసంశెట్టి శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో 16మంది మహిళా భజన బృందం సభ్యులు వెళ్లారు.

అమరావతిపై వైసీపీ విషప్రచారం హేయం

తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి మమత

ఆలమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై వైసీపీ విష ప్రచారం ఆ పార్టీ దిగజారు డుతనానికి నిదర్శనమని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ జడ్పీటీసీ దండంగి మమత అన్నారు. సొంత రాష్ట్రం, సొంత రాజధాని, అక్కడి ప్రజలపై యుద్ధం చేసే పార్టీ ప్రపంచంలోనే ఏకైక పార్టీగా వైసీపీ గుర్తింపు పొందిందన్నారు. చింతలూరులో శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమరావతిపై ఆపార్టీ నాయకులు సైకోలుగా మారి దుష్ప్రచారం చేస్తున్నారని ప్రజలు 151 నుంచి 11కి పరిమితం చేసినప్పటికీ వైసీపీకి బుద్ధి రావడం లేదన్నారు. 2019 వరకు అమరావతిని రాజధానిగా స్వాగతిస్తున్నామని చెప్పి 2019లో అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అంటూ రాష్ట్ర ప్రజలను వైసీపీ మోసం చేసిందన్నారు. మూడు ముక్కలాట ఆడి ఐదేళ్లు వృధా చేసిన ఘనుడు జగన్ అని ఆమె ధ్వజమెత్తారు. జగన్ ఇంటితో సహా పలువురు ప్రముఖులు అక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నారనే విషయాన్ని వైసీపీ గుర్తించాలన్నారు. అమరావతి, అక్కడ ప్రజలపై చేసిన దుష్ప్రచారాలను తక్షణం విరమించుకుని వారికి క్షమాపణలు చెప్పాలని మమత డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే వేగుళ్ల సమీక్ష

మండపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు, లో ఓల్టేజీపై ఆయన ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, ఈఈడీఈఈలతో సమీక్ష నిర్వహించి సమస్య పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యలపై మాట్లా డారు. టేకి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరమని అధికారులు సూచించగా వెంటనే ఆయన విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో మాట్లాడి మంజూరు చేయాలని కోరారు. కపిలేశ్వరపురం మండలంలోని వెదురు మూడి, నల్లూరు, నిడసనమెట్ట, వల్లూరు గ్రామాల్లో ఉండే విద్యుత్ సమస్యలను పరిష్క రించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు మండ లంలో పర్యటించి చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈ రత్నాలరావు, డీఈఈలు తిరుమలరావు, మురళీ తోపాటు స్థానిక నేతలు మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



అయినవిల్లి: యోగాసనాలు వేస్తున్న డ్వాక్రా మహిళలు

అయినవిల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని, ప్రతీ ఒక్కరూ యోగా చేయడాన్ని అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో జి.సరోవర్ అన్నారు. మండలంలోని పాలిటెక్నికల్ కళాశాల గ్రౌండ్‌లో శనివారం ఉదయం స్వయం సహాయక సంఘాల సభ్యులకు, మహిళా సమాఖ్య, వెలుగు ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళలకు యోగాశిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్ ఎస్.విష్ణుకుమారి నిర్వహించారు. జిల్లా గ్రామాణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలతో ఈకార్యక్రమం చేపట్టినట్టు ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అకౌంటెంట్ భవానీ, వీవోఏలు నాగమణి, నాగలక్ష్మి, నాగదుర్గ, ధనలక్ష్మి, భారతి, మల్లేశ్వరి, దుర్గ, అన్నపూర్ణ, జ్ఞానేశ్వరి, వెంకటేశ్వరరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ముమ్మిడివరం, జూన్7(ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని తగ్గించుకుని ఉద్యోగులు పనితీరును మరింత మెరుగుపరుచుకోవచ్చని ఏపీఎం పీవీవీ రమణ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల మహిళా సమాఖ్యఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచర్ రాంబాబు పర్యవేక్షణలో శ్వాస నియంత్రణ పద్ధతులు, సులభమైన యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. ఈసీ ఎం.లక్ష్మి, వి.భవానీ, ఆర్.శ్యామల, నాగమణి, కె.నిర్మల, ఎన్.సత్యవతి, మండల సమైక్య నాయకులు, గ్రామసంఘ నాయకురాళ్లుపాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

మామిడికుదురు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మహిళా సమాఖ్య ఏపీఎం వరహాలబాబు సూచించారు. శనివారం మామిడికుదురు మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో యోగసనాలు వేశారు. యోగా గురువు కేతన్ ఆకుల, యోగా శిక్షకుడు కోట బ్రహ్మానందంలు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, మహిళా సమాఖ్య కోశాధికారి నాగార్జున, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లిక పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల యోగాసనాలు

పి.గన్నవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి):పి.గన్నవరం హైస్కూల్ ఆవరణలో ఏపీఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో యోగాసనాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. 132మంది డ్వాక్రా మహిళలతో ఆసనాలు వేయించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని డిప్యూటీ ఎంపీడీవో ఉమామ హేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ ఏవో శర్మ, యోగా ఉపాధ్యా యులు వై.సతీష్, దుర్గాప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

భార్య, కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

యానాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): యానాం శివారు మత్స్య గ్రామం సావిత్రినగర్‌కు చెందిన భార్య, కుమారుడి అదృశ్యంపై ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై యానాం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సావిత్రినగర్ కొత్త కాలనీకి చెందిన రేఖాడి భైరవస్వామి భార్య గంగా (27), మూడో కుమారుడు రాజ్‌కిరణ్ (6) ఈనెల4వతేదీ నుంచి కనిపించడం లేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం కుమారుడ్ని స్థానిక పాఠశాలకు తీసుకువెళ్లి వస్తానని భార్య గంగా వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తహశీల్దార్‌పై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

అమలాపురం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మపై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ పేర్కొన్నారు. భవిష్యతులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కఠినచర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాడులకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని రెవెన్యూ ఉద్యోగులకు బాపూజీ పిలుపునిచ్చారు.

కోనసీమలో స్నానాల రేవులను పునరుద్ధరించాలి

అమలాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమలో స్నానాల రేవులను పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అమలాపురంలో శనివారం రేవుల పునరుద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన స్నానాల రేవుల పునరుద్ధరన కోసం సమావేశం నిర్వహించారు. స్నానాల రేవుల వద్ద దేవతా తర్పణాలు, పితృ తర్పణాలు, పిండ ప్రదానం వంటి కార్యక్రమాలు ఎన్నో ఉంటాయన్న విషయాన్ని గుర్తెరిగి స్నానాల రేవులను పునరుద్ధరించి అభివృద్ధి చేయాలని వక్తలు కోరారు. కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర, మట్టపర్తి మురళీకృష్ణ, కరాటం ప్రవీణ్, చెల్లుబోయిన శ్రీనివాస్, దొమ్మేటి పరశురాముడు, డాక్టర్ దుంగా వెంకటేశ్వరరావు, బి.సూరజ్, అబ్బిరెడ్డి బాలసోమేశ్వరరావు, కడలి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

11న సప్తనదీ మహాజ్యేష్టాభిషేకం



సప్తనదీ మహాజ్యేష్టాభిషేకానికి సిద్ధం చేసిన నదీ జలాలతో అర్చకులు

అంతర్వేది, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల11వ తేదీ జ్యేష్టా నక్షత్ర మహా పర్వదినం సందర్భంగా స్వామివారి మూలవరులకు సప్త నదీ జలాలతో మహాజ్యేష్టాభిషేకం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. సప్తనదుల్లో సేకరించిన జలాలను అర్చకులు శనివారం ఆలయ ధ్వజస్తంభం వద్ద సిద్ధంచేసి జ్యేష్టాభిషేకానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. స్వామివారి మహా జ్యేష్టాభిషేకానికి రూ.400 టిక్కెట్‌ను ఆలయ కౌంటర్ వద్ద కొనుగోలుచేసి మహాజ్యేష్టాభికం, శాంతి హోమాల్లో పాల్గొనాలని ఏసీ సత్యనారాయణ తెలిపారు.



ఎమ్మార్సీ భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

కపిలేశ్వరపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శనివారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, మండల అధ్యక్షుడు జువ్వల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐ.సూరి బాబు, గౌరవ అధ్యక్షుడు ఎంవీ రమణారావు తదితరులు పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జీవీ భీమేశ్వరరావు, అనంత సత్యనారాయణమూర్తి, ముత్తా సత్యనారాయణ, జీవీ రమణ, జిల్లా కౌన్సిలర్లు కేవీవీఎస్ఎన్ మూర్తి, సీనియర్ నాయకులు ఎస్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

మండపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు, లో ఓల్టేజీపై ఆయన ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, ఈఈఈడీఈఈలతో సమీక్ష నిర్వహించి సమస్య పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యలపై మాట్లా డారు. టేకి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరమని అధికారులు సూచించగా వెంటనే ఆయన విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో మాట్లాడి మంజూరు చేయాలని కోరారు. కపిలేశ్వరపురం మండలంలోని వెదురు మూడి, నల్లూరు, నిడసనమెట్ట, వల్లూరు గ్రామాల్లో ఉండే విద్యుత్ సమస్యలను పరిష్క రించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు మండ లంలో పర్యటించి చర్యలు తీసుకోవాలని ఆదే



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

శించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈ రత్నాలరావు, డీఈఈలు తిరుమలరావు, మురళి తోపాటు స్థానిక నేతలు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పుత్సల శ్రీను, పెన్మెత్స రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై వైసీపీ విషప్రచారం హేయం

తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి మమత



ఆలమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై వైసీపీ విష ప్రచారం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ జడ్పీటీసీ దండంగి మమత అన్నారు. సొంత రాష్ట్రం, సొంత రాజధాని, అక్కడి ప్రజలపై యుద్ధం చేసే పార్టీ ప్రపంచంలోనే ఏకైక పార్టీగా వైసీపీ గుర్తింపు పొందిందన్నారు. చింతలూరులో శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమరావతిపై ఆపార్టీ నాయకులు సైకోలుగా మారి దుష్ప్రచారం చేస్తున్నారని ప్రజలు 151 నుంచి 11కి పరిమితం చేసినప్పటికీ వైసీపీకి బుద్ధి రావడం లేదన్నారు. 2019 వరకు అమరావతిని రాజధానిగా స్వాగతిస్తున్నామని చెప్పి 2019లో అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అంటూ రాష్ట్ర ప్రజలను వైసీపీ మోసం చేసిందన్నారు. మూడు ముక్కలాట ఆడి ఐదేళ్ల వృధా చేసిన ఘనుడు జగన్ అని ఆమె ధ్వజమెత్తారు. జగన్ ఇంటితో సహా పలువురు ప్రముఖులు అక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నారనే విషయాన్ని వైసీపీ గుర్తించాలన్నారు. అమరావతి, అక్కడ ప్రజలపై చేసిన దుష్ప్రచారాలను తక్షణం విరమించుకుని వారికి క్షమాపణలు చెప్పాలని మమత డిమాండ్ చేశారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్‌కు మంత్రి, కలెక్టర్ అభినందనలు



చెముడులంక విద్యార్థి తేజను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

ఆలమూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియాలో 172 ర్యాంకు సాధించిన చెముడులంక విద్యార్థి నాగిరెడ్డి తేజచంద్రనారాయణను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. కడియం మండలం కడియపులంకలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి, కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చిన్నరాయుడు, ఆర్డీవో కృష్ణనాయక్‌తోపాటు పలువురు చెముడులంక గ్రామానికి చెందిన సన్నకారు రైతు నాగిరెడ్డి శ్రీనివాస్ కుమారుడు తేజను సత్కరించారు. ఈసందర్భంగా పలువురు నర్సరీ రైతులు తదితరులు విద్యార్థిని అభినందించారు.

యోగాపై డ్వాక్రా మహిళలకు శిక్షణ

ఆలమూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్వాక్రా మహిళలకు యోగాపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏపీఎం ధనరాజు అధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు యోగాపై శిక్షణ ఇచ్చి యోగా వల్ల కలిగి ప్రయోజనాలు తెలిపారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. యోగాలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో యోగా చేయిస్తున్న దృశ్యం

అన్నపూర్ణ డే కేర్ హోమ్ ప్రారంభం

ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి మ్యాజిక్ ఫ్యామిలి ఆధ్వర్యంలో నూతనంగా నిర్వహిస్తున్న అన్నపూర్ణ డే కేర్ హోమ్ ఫర్ ఎజిడ్ శనివారం ప్రారంభించారు. ఈ హోమ్ ద్వారా వృద్ధులకు వైద్య సేవలు భోజన సదుపాయం తదితర సేవలను అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మోహిత్, సీత పేర్కొన్నారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి భోజన సదుపాయం కల్పించారు.



ర్యాలిలో వృద్ధులకు భోజన సదుపాయం కల్పించిన దృశ్యం

ప్రమాదభరితంగా డ్రెయిన్ కల్వర్టు

రావులపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌పై నిర్మించిన కల్వర్టు ప్రమాదంగా మారడంతో ఆ ప్రాంతవాసులు హడలిపోతున్నారు. రావులపాలెం మండలం దేవరపల్లి శివారు పెంకులపాటి గరువు వద్ద ఉన్న డ్రెయిన్‌పై నిర్మించిన కల్వర్టు ప్రమాదంగా మారింది. ఇసుక లోడుతో వెళ్లే భారీ వాహనాలు ఉదయం రాత్రి తేడా లేకుండా దాని మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో ఒక పక్క రిటైనింగ్ వాల్ సైతం డ్రెయిన్‌లోకి జారిపోయింది. లోడు లారీలు ప్రయాణిస్తున్న సమయంలో కల్వర్టు పూర్తిగా మునిగిపోతే ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయంటూ పలువురు వాపోతున్నారు. త్వరలో పాఠశాలలో తెరవనున్న నేపథ్యంలో పాఠశాలల విద్యార్థుల స్కూల్ బస్సులు, ఆటోలు ఈ కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఆ సమయంలో కల్వర్టు కుంగిపోతే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భానుడి ప్రతాపానికి ప్రజల ఉక్కిరిబిక్కిరి



నిర్మానుష్యంగా ఉన్న రావులపాలెం-ఈతకోట రోడ్డు

రావులపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో పలు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వేడిగాలులు వీస్తుండటంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు, జనసంచారం కూడా బోసిపోతున్నాయి. జాతీయ రహదారితో పాటు ఆయా గ్రామాల్లోని రోడ్లు సైతం ఉదయం నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి.



శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,13,606 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తామరపల్లిలో కుంతీదేవి జాతర

కె.గంగవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తామరపల్లి గ్రామంలో కుంతీదేవి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన గారడీ బృందాలు నృత్యాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్యే పరామర్శ

కె.గంగవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీడీపీ నాయకుడు ఎం.ఇజ్రాయిల్ తండ్రి వెంకట్రావు మరణించిన విషయం తెలుసుకున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం మసకపల్లిలో ఇజ్రాయిల్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఎంపీపీ పంపన నాగమణి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వాసంశెట్టి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు తదితరులు ఇజ్రాయిల్‌కు తమ సానుభూతి తెలిపారు.



ఆత్రేయపురం నుంచి లొల్ల వెళ్లే పంట కాలువ వద్ద పొంచి ఉన్న ముప్పు

ఆదమరిస్తే ఇక అంతే

ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆదమరిచి ఆ వంతెనపై ప్రయాణాలు సాగిస్తే ఇక అంతే సంగతులని పలువురు వాహనదారులు వ్యాఖ్యానిస్తున్నారు. లొల్ల నుంచి ఆత్రేయపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులోని పంటకాలువ వంతెనపై ప్రతిరోజూ వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనకు రెయిలింగ్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడిన ఉదంతాలున్నాయి. లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనపై రెయిలింగ్, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు పంటకాలువలోకి దూసుకుపోయి ప్రమాదాల బారిన పడిన ఉదంతాలున్నాయి. వంతెనకు రైలింగ్‌తో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



జొన్నాడ హైస్కూల్ గ్రౌండ్‌ను శుభ్రం చేయిస్తున్న విద్యా కమిటీ చైర్మన్

ఉపాధి కార్మికులతో పాఠశాల గ్రౌండ్ శుభ్రం

ఆలమూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జొన్నాడ జడ్పీ గరల్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉపాధి కార్మికులతో శుభ్రం చేయించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్ అధ్వర్యంలో ఉపాధి కార్మికులతో పాఠశాల ఆవరణతోపాటు, ఆటస్థలంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. త్వరలో పాఠశాల తెరవనున్నడంతో పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఉపాధి కూలీలతో శుభ్రం చేయించిన ఆయన్ను పలువురు అభినందించారు.

రాంబాబుకు పలువురి పరామర్శ

ద్రాక్షారామ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగం పొందిన పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబును రామచంద్రపురం మండలం వెలంపాలెంలో శనివారం పలువురు పరామర్శించారు. టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పరామర్శించారు. టీడీపీ అధికారి ప్రతినిధి నల్లా స్వామి, సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి పుల్లయ్య, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. శనివారం రావిచెట్టు సెంటర్‌లోని ఒక ఇంట్లో ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపి, ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3400 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

ద్రాక్షారామ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో శనివారం బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం స్థానిక షియా జామియా జాఫరీ మసీదులో నమాజ్ చేశారు. మత గురువు మీర్జా అస్కరీ హుస్సేన్ నమాజ్ చేయించగా భక్తులు నమాజ్ చేశారు. మార్కెట్‌లోని జామియా మసీదులో పలువురు ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు.

వెలంపాలెంలో : వెలంపాలెంలో షాభాజియ మసీదులో శనివారం బక్రీద్ ప్రార్థనలు జరిగాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంత్రి సుభాష్ మసీదు మరమ్మతులకు సొంత నిధులు ఇవ్వ డంతో మరమ్మతులు పూర్తి చేశామని పలువురు ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. అనంత రం సత్యంను సత్కరించారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పలువురు ముస్లింలు బక్రీద్‌ను జరుపుకున్నారు. మండపేటలో జామియా మసీదు, గాంధీనగర్‌లో చిన్నమసీదు, రావులపేట తదితర మసీదు ల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మండలం లోని కేశవరం, ద్వారపూడి, ఏడిద, తదితర గ్రామాల్లో కూడా బక్రీద్‌ను జరుపుకున్నారు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. అంగర మసీదు ఎ ఇబ్రహీమ నందు మసీదు ముతవల్లీ మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మసీద్ ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్తర్ బక్రీద్ విశిష్టత తెలిపారు. అంగర, పడమరఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల ముస్లింలు మసీద్‌లో నమాజ్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.



వెలంపాలెంలో సత్యంను సత్కరిస్తున్న ముస్లింలు

టవర్ల మార్పు సమయంలో విద్యుత్ అంతరాయం తగ్గించాలి



డబుల్ సర్క్యూట్ టవర్ల మార్పుపై చర్చిస్తున్న ఎస్ఈ రాజబాబు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాడైన 13 కేవీ టవర్ల మార్పు సమయంలో విద్యుత్ అంతరాయం తగ్గించేలా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రాజబాబు సూచించారు. శనివారం రామచంద్రపురం డివిజనల్ ఇంజనీరు కార్యాలయంలో ట్రాన్స్‌కో, డిస్కం అధికారులతో 132 టవర్ల మార్పు సమయంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించడంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రామచంద్రపురం 132 కేవీ ఉపకేంద్రం నుంచి ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు, అమలాపురం వరకు పాడైన 30 డబుల్ సర్క్యూట్ టవర్లలో 25 మార్పు చేశామన్నారు. మిగిలిన 5 టవర్ల మార్పుపై సమావేశంలో చర్చించారు. అంతకు ముందు క్షేత్రస్థాయిలో విద్యుత్ టవర్ల మార్పును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ కె.రత్నాలరావు, డివిజనల్ ఇంజనీర్ కె.మురళీమోహన్, ఏఈలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మపురి గ్రామంలో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను శనివారం వైభవంగా నిర్వహించారు. టీటీడీ, మండల పరిషత్ నిధులతో ఆలయాన్ని నిర్మించారు. శనివారం ప్రతిష్ఠ సందర్భంగా వేద పండితులు పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ఠ పూజలు చేసి విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, బ్రహ్మపురి సర్పంచ్ సాగి వెంకట సత్యవతి వీరభద్రరాజు, కూటమి నాయకుడు చొల్లంగి ఎదుర్లయ్య దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. మసకపల్లి పిల్లి కల్యాణ్, పంపన సుబ్బారావు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

పల్లా సింహాచలంకు పలువురి నివాళి



సింహాచలం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే మంత్రి సుభాష్ విశాఖలోని శ్రీనివాసరావు ఇంటికి బయలుదేరి వెళ్లారు. సింహాచలం మృత దేహానికి నివాళులర్పించి, శ్రీనివాసరావు కుటుంబీకులకు ధైర్యం కల్పించారు.

సింహాచలం మృతి తీరని లోటు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పార్టీకి తీరనిలోటని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కుటుంబానికి ఆయన తన సానుభూతి తెలిపారు.

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక

కె.గంగవరం, జూన్7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అముజూరు మెయిన్ పాఠశాల విద్యార్థిని జంజం బాలదుర్గ ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల ఎంట్రన్స్ ఫలితాల్లో విజయం సాధించి సీటు సంపాదించిందని పాఠశాల



ప్రదానోపాధ్యాయుడు చొల్లంగి శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈవో ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ నానావరపు కళ్యాణి, శ్రీనివాసు తదితరులు అభినందించారు.

నేడు జరిగే యోగాసనాల్లో సీనియర్ సిటిజన్లు పాల్గొనాలి

కొత్తపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నేడు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో జరిగే యోగాసనాల్లో సీనియర్ సిటిజన్లంతా పాల్గొనాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ యోగాంధ్ర -2025 పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మే 21 నుంచి జూన్ 21 వరకూ నెల రోజులపాటు యోగాపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఆదివారం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక థీమా టిక్ యోగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ప్రతి సీనియర్లు ఉత్సాహంగా పాల్గొనాలని ఆర్డీవో శ్రీకర్ కోరారు.



సప్తనదీ మహాజ్యేష్టాభిషేకానికి సిద్ధం చేసిన నదీ జలాలతో అర్చకులు

11న సప్తనదీ మహాజ్యేష్టాభిషేకం

అంతర్వేది, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల11వ తేదీ జ్యేష్టా నక్షత్ర మహాపర్వదినం సందర్భంగా స్వామివారి మూలవరులకు సప్త నదీ జలాలతో మహాజ్యేష్టాభిషేకం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. సప్తనదుల్లో సేకరించిన జలాలను అర్చకులు శనివారం ఆలయ ధ్వజస్తంభం వద్ద సిద్ధంచేసి జ్యేష్టాభిషేకానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. స్వామివారి మహా జ్యేష్టాభిషేకానికి రూ.400 టిక్కెట్‌ను ఆలయ కౌంటర్ వద్ద కొనుగోలుచేసి మహాజ్యేష్టాభికం, శాంతి హోమాల్లో పాల్గొనాలని ఏసీ సత్యనారాయణ తెలిపారు.



కేశవరంలో హైస్కూల్ ప్రహరీ కోసం దీక్ష చేస్తున్న శ్రీవాణి

కొనసాగుతున్న శ్రీవాణి శాంతియుత దీక్ష

మండపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణం చేపట్టాలంటూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి చేస్తున్న శాంతియుత దీక్ష శనివారం 51వ రోజుకు చేరింది. గ్రామంలోని శీతల పానీయాల సంస్థ ముందుకు వచ్చి హైస్కూల్ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పాఠశాల చుట్టూ వున్న ఆక్రమణలు తొలగించకుండా రాజకీయాలు చేస్తుండటం వల్ల పనులు చేపట్టలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సత్వరమే ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రసాద్‌కు పలువురు అభినందనలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా ఎంపికైన వెల్ల గ్రామానికి చెందిన పోలినాటి ప్రసాద్‌ను ఎంపీ బోస్ అభినందించారు. ఇటీవల ప్రసాద్‌ను పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించిన నేపథ్యంలో ఎంపీ బోస్ తదితరులు అభినందించారు.